సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 12.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 200
పేజీలు: 08 వెల: రూ. 5

## కొండగట్టు గిరి ప్రదక్షిణకు సౌకర్యాలు

### పెద్ద హనుమాన్ జయంతికి అన్ని ఏర్పాట్లు..

- కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు..
- స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి లక్ష్మణ్ కుమార్..
- పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ పూజారులు..

03





## రేవంత్.. బండిది ఫెవికాల్ బంధం

### మంత్రిగా కొనసాగే నైతిక హక్కు బండి సంజయ్‌కు లేదు

- రేవంత్ రెడ్డి హోమ్ శాఖ మంత్రిగా ఉండి పట్టించుకోవటంలేదు..
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి నిప్పులు

03

## సోమనాథ్ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారు

### సోమనాథ్ అమృత్ మహోత్సవ్‌లో ప్రధాని సంచలన వ్యాఖ్యలు



- జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకే నెహ్రూ ప్రాధాన్యం
- సోమనాథ్ పునఃప్రతిష్ఠ భారత స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక
- సర్దార్ పటేల్ సంకల్పంతోనే సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం

04

# తప్పెవరిది!

### బైక్ రేసింగ్ లతో 'గాలి'లో ప్రాణాలు

- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోని పోలీసులు
- డ్యూటీ ని మరిచిన రక్షక బటులు
- పోలీస్ స్టేషన్ల పై నిఘా పెట్టని పోలీసు ఉన్నతాధికారులు
- కెమెరా తో క్లిక్ అనిపించడం.. ఫైన్లు వేయడమే పనినా?
- పోలీసుల ఉదాసీనతపై విమర్శలు




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** పాలమూరు పోలీసుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణం లో ఎలాంటి నేరం జరిగినా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైరవీలతో కాలం గడుపుతున్నారని.. నేతల సేవలో తరిస్తున్నారని.. పోలీసు డ్యూటీని మరిచిపోయారన్న విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి వ్యవస్థ లో సామాన్యునికి మిగతా 02లో

### స్పోర్ట్స్ బైక్ ఢీకొట్టడంతో పల్టీలు కొట్టిన కారు

చిన్నారులతో సహా ఐదుగురి దుర్మరణం

- బర్త్‌డే పార్టీ నుంచి వస్తుండగా విషాదం..
- బైక్ రేసింగ్‌లపై పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికుల ఆగ్రహం

03



- చంద్రబాబు-పవన్ భేటీల వెనుక భారీ రాజకీయ వ్యూహం?
- సెటిలర్ ఓటు బ్యాంక్ టార్గెట్‌గా బీజేపీ కొత్త ప్లాన్?
- ఏపీలో సక్సెస్ అయిన కూటమి ఫార్ములాను తెలంగాణలో అమలు చేసే ఆలోచన?
- కాంగ్రెస్, బీఆర్ఎస్ బలహీనతల మధ్య బీజేపీ రాజకీయ వేగం పెంచిన మోదీ
- పవన్ ఇమేజ్, చంద్రబాబు అనుభవంతో తెలంగాణలో కమలం వికసించే వ్యూహం
- హోమ్ విజిట్స్‌తో భారీ రాజకీయ సంకేతాలు ఇచ్చిన ప్రధాని మోదీ
- హైదరాబాద్ వీకెండ్ మీటింగ్స్‌పై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ
- తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు మోదీ భేటీలు పునాదులా?

● మోదీ మాస్టర్ స్ట్రోక్..

## తెలంగాణ బీజేపీ
# రోడ్ మ్యాప్ రెడీ

### దక్షిణాదిపై ఫోకస్ పెంచిన కమలం

**ముద్ర, డెస్క్ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ సైలెంట్‌గా మొదలై భారీ ప్రభావాన్ని చూపిస్తుంటాయి. తాజాగా హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసాలకు వెళ్లి మరీ పలకరించడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణ మర్యాద భేటీలా కనిపించినా.. దీని వెనుక పెద్ద రాజకీయ లెక్కలు ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. సాధారణంగా ప్రధానమంత్రి పర్యటనల్లో అధికారిక కార్యక్రమాలకే ప్రాధాన్యం ఉంటుంది. కానీ ఈసారి షెడ్యూల్‌లో పెద్దగా ప్రస్తావన లేకుండానే మోదీ నేరుగా చంద్రబాబు, పవన్ నివాసాలకు వెళ్లడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా తెలంగాణ రాజకీయాల కోణంలో చూస్తే.. ఇది కేవలం స్నేహపూర్వక సమావేశం కాదని, భవిష్యత్ ఎన్నికల వ్యూహానికి తొలి సంకేతమని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ క్రమంగా బలపడటం, అస్సాంలో ఆధిపత్యం కొనసాగించడం తర్వాత ఇప్పుడు దక్షిణాదిపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. కర్ణాటక తర్వాత బీజేపీ అత్యంత ఆశలు పెట్టుకున్న రాష్ట్రం తెలంగాణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు శాతం పెరగడం, పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి మద్దతు పెరగడం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. అదే సమయంలో బీఆర్ఎస్ బలహీనపడటం, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రారంభ అసంతృప్తి కనిపించడం కమలానికి అనుకూల వాతావరణంగా మారుతోంది. మిగతా 02లో

## హిందూ ఏక్తా యాత్రకు సర్వం సిద్ధం

### రాష్ట్రం నలమూలల నుండి తరలి రానున్న కాషాయ సైనికులు




- ఏక్తా యాత్ర ర్యాలీకి సిద్ధమైన కరీంనగర్ ప్రజలు
- బండి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- కళారూపాలతో ఆకట్టుకోనున్న ఏక్తా యాత్ర

04

# బండి భగీరథ్ కేసు

### విచారణకు సీఎం రేవంత్ ఆదేశం

- ఫిర్యాదు వచ్చి రోజులు గడిచినా చర్యలు లేకపోవడంపై ఆగ్రహం
- బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక సిట్ ఏర్పాటు..
- డీసీపీ రితిరాజ్‌కు దర్యాప్తు బాధ్యతలు
- ప్రధాని మోదీ పర్యటన భద్రతల వల్లే విచారణ ఆలస్యం: డీజీపీ వివరణ
- కేసును అన్ని కోణాల్లో విచారించాలి..
- కఠిన చర్యలు తీసుకోవాలి.. సీఎం రేవంత్ ఆదేశం



**ముద్ర, హైదరాబాద్:** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై నమోదైన కేసుపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. కేసుపై తక్షణమే విచారణ ప్రారంభించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ను ఆదేశించారు. ఫిర్యాదు నమోదైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు అందినా ఇప్పటి వరకు విచారణలో పురోగతి లేకపోవడంపై ముఖ్యమంత్రి నేరుగా డీజీపీని ప్రశ్నించారు. కేసు విషయంలో ఆలస్యం ఎందుకు జరిగిందని.. బాధ్యులపై ఎందుకు చర్యలు మిగతా 02లో

- దేశ ఖజానాకు పసిడి బలం.. రూపాయికి రక్షణ కవచం!
- బంగారం దిగుమతులతో డాలర్ నిల్వలకు గండి పడుతోందా?
- ఫిజికల్ గోల్డ్‌కు బ్రేక్.. డిజిటల్ గోల్డ్ వైపు ప్రభుత్వ చూపు
- ఆర్బీఐ గోల్డ్ రిజర్వ్స్ పెంపు వెనుక అసలు ఆర్థిక వ్యూహం ఇదే!
- ప్రజల బంగారం కొనుగోళ్లపై నియంత్రణకు కేంద్రం ఎందుకు మొగ్గు?

## ఇది 'డబుల్ గేమ్' కాదు..
# ఆర్థిక వ్యూహం!

### ఆర్బీఐకి బంగారం 'భద్రత'.. ప్రజలకు మాత్రం 'భారం' ఎందుకు?



**ముద్ర డెస్క్ :** ఒకవైపు దేశ కేంద్ర బ్యాంకు టన్నుల కొద్దీ బంగారాన్ని తన ఖజానాలో నింపుకుంటుంటే, మరోవైపు ప్రధాని ప్రజలను బంగారం కొనొద్దని కోరడం వినడానికి విరుద్ధంగా అనిపిస్తుంది. 'ప్రభుత్వానికి ఒక నీతి, మాకు ఒక నీతా?' అని సామాన్యుడికి అనుమానం రావడం సహజమే. కానీ, దీని వెనుక ఉన్న ఆర్థిక సమీకరణాలను గమనిస్తే.. ఇది 'డబుల్ గేమ్' కాదు, దేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని కాపాడే ఒక 'మాస్టర్ ప్లాన్' అని అర్థం అవుతుంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే 2వ అతిపెద్ద బంగారు కొనుగోలుదారుగా అవతరించింది. 2024లో ఏకంగా 72.60 టన్నుల బంగారాన్ని ఆర్బీఐ మిగతా 02లో

## ఇది టీమిండియా
# యుగం!

04



### ఐసీసీ ర్యాంకింగ్స్, టైటిళ్లలో టీమిండియా నంబర్ వన్!

- వన్డే, టీ20ల్లో భారత్ అగ్రస్థానం
- ప్రపంచ క్రికెట్‌పై టీమిండియా ఆధిపత్యం
- టీమిండియా జోరుకు ప్రపంచ జట్లు షాక్

*"అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ అప్రతిహత విజయయాత్ర కొనసాగుతోంది. ఐసీసీ తాజా వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు..వరుసగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 వరల్డ్ కప్ టైటిళ్లను ముద్దాడి టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను తన గుప్పిట్లోకి తీసుకుంది. గతంలో ఆస్ట్రేలియా ప్రదర్శించిన ఆధిపత్యాన్ని తలపిస్తూ రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్‌ల సారథ్యంలో యువ భారత్ సృష్టించిన ఈ రికార్డుల పరంపర 'టీమిండియా నయా శకానికి' నాంది పలికింది."*

-ముద్ర డెస్క్:


ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 12.05.2026
www.mudranews.in | @mudranews



### మైగ్రేన్ నొప్పి నివారణకు ఇవి పాటించండి



చీకటి గదిలో విశ్రాంతి: మైగ్రేన్ ఉన్నప్పుడు కాంతి మరియు శబ్దం నొప్పిని పెంచుతాయి. అందుకే ప్రశాంతంగా, చీకటిగా ఉన్న గదిలో కాసేపు పడుకోవడం వల్ల త్వరగా ఉపశమనం లభిస్తుంది.

# తప్పెవరిది!




(మొదటి పేజీ తరువాయి)

న్యాయం జరుగుతుందనేది ఎడారిలో నీటి భావి లాంటిది అని చెప్పవచ్చు. పాలమూరు పట్టణ పోలీసులపై ప్రజలకు నమ్మకం ఎప్పుడో పోయింది. పొద్దున్నుంచి రాత్రి వరకు వారికి ఒక్కటే డ్యూటీ.. వాహనాలకు వైపు కెమెరా లు గురి పెట్టడం.. క్లిక్ అనిపించడం.. ఫోటో తీయడం... వసూల్ చేయడం.. ఇదే వారికున్న ప్రధాన మైన డ్యూటీ. పట్టణం లో రూరల్, వన్ టౌన్, టూ టౌన్, ట్రాఫిక్, మహిళా, సీసీఎస్, ఇంటలిజెన్స్ పోలీస్ స్టేషన్లతో పాటు డీ ఎస్ పీ, ఎస్ పీ కార్యాలయాలు ఉన్నా అవి ప్రజల కోసం పనిచేయడం లేదనే విమర్శలు చాలా ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్ కు సీఐ, ఎస్ఐ సరిపడా సిబ్బంది ఉన్నా ఫైన్లు వసూలు చేయడం తప్పదా సరిగ్గా డ్యూటీలు చేయడం లేదనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. పట్టణంలో అస్తవ్యస్త ట్రాఫిక్, వాహనాల అడ్డదిడ్డంగా పార్కింగ్, అనుమతి లేని సైలెన్సర్ల తో శబ్దం చేస్తున్నా, ఇళ్లలో దొంగలు పడినా, ప్రమాదాలు జరిగినా ఇవేమి పోలీసులకు పట్టని వ్యవహారం అని ప్రజలు వారి తీరు పై మండిపడుతున్నారు. ఇసుక లారీ లు బాహాటంగా కళ్ళేదుటే తిరిగినా వాళ్లకు ఇసుక కనపడదు కానీ లారీ పట్టుకుంటే దాని వెనుక ఉన్న డబ్బే కనపడుతుంది.గత ఆదివారం పట్టణ కేంద్రం సమీపంలో పోలీసుల అండతో డంప్ చేసిన ఇసుకను జిల్లా కలెక్టర్ చొరవతో రెవిన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ ఇసుక విలువ రూ. రెండు కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఇసుక పాలమూరు సమీప మండలాలైన కోయిల కొండ, హన్వాడ వాగుల నుంచి పోలీసుల అండతో తరలించి ఇక్కడ డంప్ చేశారు.ఇక్కడి ఇసుక దందా రూ. కోట్లల్లో ఉందనే విషయం బట్టబయలైంది.

పాలమూరు బై పాస్ రహదారి పై బైక్ రేసింగ్ లు జరుగుతున్నాయని ఈ ప్రాంత వాసులు ఎన్నో సార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు తీసుకోవడంలో పోలీసులు పూర్తిగా విఫలం చెందారు. వీరి నిర్లక్ష్యానికి ఆదివారం అర్ధరాత్రి ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి. ఒక బైక్ రైడర్ తన బైక్ ను అతివేగంగా నడిపి కార్ ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కార్ మూడు పల్టీలు కొట్టిందంటే బైక్ స్పీడ్ ఎంత ఉందో ఇట్టే అర్థం అవుతోంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రెండు సీసీ కెమెరా లు ఉన్నా అవి పనిచేయడం లేదు. కేవలం అవి అలంకార ప్రాయంగా ఉండడంతో నిఘా తీరు ఎలా ఉందో తెలుస్తుంది. ఇక్కడ ప్రమాదంలో చనిపోయిన అభం శుభం తెలియని చిన్నారులను చూస్తే కళ్లు చెమర్చక తప్పదు. బైక్ రేసింగ్ లను కట్టడి చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అందరూ అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు ఈ బై పాస్ పై చాలా జరిగాయి. అయినా పోలీసులు ప్రమాదాల నివారణ కు చర్యలు చేపట్టలేదు.

గత 15 రోజుల క్రితం జిల్లా ఎస్ పి జానకి ఈ బై పాస్ జరుగుతున్న ప్రమాదాల పై సమీక్ష నిర్వహించడమే కాకుండా స్వయంగా ఆమె బై పాస్ వద్దకు వచ్చి ప్రమాద స్థలాలను గుర్తించారు. అయినా కింది స్థాయి పోలీసుల తీరు మారడం లేదు. ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంపై నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్లిన డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఉపన్యాసాలు దంచారు. ఇక ముందు బై పాస్ పై బైక్ రేసింగ్ లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. మాజీ మంత్రి ప్రమాదంపై మాట్లాడుతూ ఇది పోలీసుల నిర్లక్ష్యం అని ఆరోపించారు. పోలీసులు,అధికార నేతలు,ప్రతిపక్ష నేతలు ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడే స్పందిస్తారు.ఇకనైనా ప్రమాదాల నివారణకు పోలీసులు ఏ చర్యలు తీసుకుంటారో వేచిచూద్దాం.

# బండి భగీరథ్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోలేదని సీఎం ఆరా తీశారు. అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను డీజీపీ సీవీ ఆనంద్ ముఖ్యమంత్రికి వివరించారు. అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ యంత్రాంగం మొత్తం భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో కేసు విచారణలో ఆలస్యం జరిగినట్లు డీజీపీ ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. నగరంలో ప్రధాని పర్యటనకు సంబంధించి విస్తృత భద్రతా చర్యలు చేపట్టడంతో అనేకమంది పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక విధుల్లో పాల్గొన్నారని తెలిపారు.

ఇదిలా ఉండగా కేసు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని సమగ్ర విచారణ నిర్వహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. కేసులో ఎవరి ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ పారదర్శకంగా జరగాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలో బండి సాయి భగీరథ్‌పై కేసుకు సంబంధించి విచారణ కోసం రాష్ట్రప్రభుత్వం మాదాపూర్ డీసీపీ (కూకట్‌పల్లి జోన్–సైబరాబాద్) రితిరాజ్ నేతృతంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయగా.. బండి సాయిభగీరథ్ కేసును డీసీపీ రుతిరాజ్ టీం విచారణ చేయనున్నది. ప్రస్తుతం ఈ వ్యవహారం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. కేసు పురోగతిపై అధికార వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ బీజేపీ రోడ్ మ్యాప్ రెడీ

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి సమయంలో ఏపీలో విజయవంతమైన ఎన్డీయే కూటమి మోడల్‌ను తెలంగాణలోనూ అమలు చేయాలన్న ఆలోచనలో మోదీ ఉన్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ వంటి ప్రాంతాల్లో సెటిలర్ ఓటు బ్యాంక్ ప్రభావం చాలా ఎక్కువ. ఈ వర్గాలపై చంద్రబాబుకు ఉన్న ప్రభావం, యువతలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఇమేజ్‌ను బీజేపీ వ్యూహాత్మకంగా ఉపయోగించుకోవాలనుకుంటోందని చర్చ జరుగుతోంది.

పవన్ కళ్యాణ్ ఆరోగ్య కారణాలతో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కూడా మోదీ స్వయంగా వెళ్లి పరామర్శించడం రాజకీయంగా కీలక సంకేతంగా మారింది. దీనివల్ల ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీలకు బీజేపీ ఎంత ప్రాధాన్యం ఇస్తుందో స్పష్టమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు చంద్రబాబు రాజకీయ అనుభవం, వ్యూహాత్మక ఆలోచనలను తెలంగాణలోనూ వినియోగించుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎదుర్కోవాలంటే కేవలం బీజేపీ ఒక్కటే సరిపోదని, ప్రాంతీయంగా ప్రభావం ఉన్న శక్తులను కలుపుకుని వెళ్లాల్సిన అవసరం ఉందని కమలం పార్టీ అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది. అందుకే మోదీ తాజా భేటీలు సాధారణ రాజకీయ మర్యాద కాదని, 2029 ఎన్నికల దిశగా కొత్త రాజకీయ సమీకరణాలకు పునాదిగా మారే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూనే, మరోవైపు మిత్రపక్షాలతో వ్యూహాత్మక భేటీలు నిర్వహించడం ద్వారా మోదీ ఒకే దెబ్బకు రెండు లక్ష్యాలను సాధించాలని చూస్తున్నారని స్పష్టమవుతోంది. తెలంగాణ రాజకీయాల్లో త్వరలోనే కొత్త కూటమి సమీకరణాలు కనిపించే అవకాశం ఉందన్న చర్చకు ఈ భేటీలు మరింత బలం చేకూర్చాయి.




# బెంగాల్‌లో వేట మొదలైంది..

**ముద్ర, న్యూఢిల్లీ:** బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ ముఖ్య నేత, మాజీ మంత్రి సుజిత్ బోస్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. మున్సిపల్ రిక్రూట్‌మెంట్ కుంభకోణం కేసులో దాదాపు ఏడు గంటల పాటు విచారించిన అనంతరం అరెస్టు చేశారు. మమతా బెనర్జీ హయాంలో ఈయన ఫైర్ సర్వీసెస్ మంత్రిగా పనిచేశారు.

ఈ కేసులో సుజిత్ బోస్‌తో పాటు అతడి కుమారుడు సముద్రకు ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. బెంగాల్‌లో అధికార మార్పిడి జరిగిన అనంతరం టీఎంసీకి చెందిన కీలక నేత అరెస్టు కావడం ఇదే తొలిసారి. మరోవైపు, గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ వ్యవస్థీకృత అవినీతి ఆరోపణలే భాజపాకు ప్రచార అస్త్రాలుగా నిలిచాయి. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా టీఎంసీ అవినీతిని పదే పదే ప్రస్తావించి ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.



# ఇది 'డబుల్ గేమ్' కాదు.. ఆర్థిక వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేయడం ఒక ఎత్తయితే, విదేశీ బ్యాంకుల నుంచి మన బంగారాన్ని వెనక్కి రప్పించడం మరో ఎత్తు. అయితే, ఇదే సమయంలో ప్రజలు బంగారం కొనడాన్ని నియంత్రించాలని ప్రభుత్వం భావించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన గోల్డ్ రిజర్వ్‌ను పెంచుకోవడం వెనుక ఉన్నవి వ్యక్తిగత అవసరాలు కావు, అవి దేశ భద్రతకు సంబంధించినవి. ఉక్రెయిన్–రష్యా యుద్ధం తర్వాత అంతర్జాతీయంగా ఏ క్షణంలో ఏ దేశంపై ఆంక్షలు విధిస్తారో తెలియని పరిస్థితి. మన ఆస్తులను వేరే దేశాలు స్తంభింపజేయకుండా ఉండాలంటే, దేనికీ లొంగని 'బంగారం' అత్యుత్తమ ఆస్తి. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించడానికి, మన విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటాను 2021లో ఉన్న 5.9% నుంచి 2026 నాటికి 16.7%కి ఆర్బీఐ పెంచింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వంటి చోట్ల దాచిన మన బంగారాన్ని దేశానికి రప్పించడం ద్వారా అత్యవసర సమయాల్లో అది మన చేతికే అందేలా వ్యూహం రచించారు. (ప్రస్తుతం 77% నిల్వలు దేశంలోనే ఉన్నాయి).

ఆర్బీఐ కొనే బంగారం దేశ కరెన్సీకి బలాన్నిస్తే.. ప్రజలు కొనే బంగారం దేశ ఆర్థిక వ్యవస్థకు భారంగా మారుతుంది. భారత్ తన బంగారం అవసరాల్లో 90% దిగుమతి చేసుకుంటుంది. మనం బంగారం కొన్న ప్రతిసారీ మన ఖజానాలోని డాలర్లను విదేశాలకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రజలు విపరీతంగా బంగారం కొంటే, మన డాలర్ నిల్వలు కరిగిపోతాయి. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ పడిపోతుంది. ఇది నిత్యావసరాల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ప్రజలు కొనే బంగారం బీరువాల్లో ఉండిపోతుంది తప్ప, అది దేశ ఉత్పత్తి రంగంలోకి రాదు. అందుకే ఆ పెట్టుబడిని ఇతర రంగాల వైపు మళ్లించాలని ప్రభుత్వం కోరుతోంది. ప్రధాని పిలుపు, విపరీతంగా పెరిగిన ధరల ప్రభావం మార్కెట్లో స్పష్టంగా కనిపిస్తోంది. జనవరిలో 100 టన్నులుగా ఉన్న దిగుమతులు, ఏప్రిల్ నాటికి 15 టన్నులకు పడిపోవడం ఒక పెద్ద మార్పు. ప్రజలు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని రీసైకిల్ చేయడం లేదా డిజిటల్ గోల్డ్, సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు మొగ్గు చూపడం వల్ల భౌతిక బంగారానికి డిమాండ్ తగ్గుతోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు వినియోగదారులలో ఒకటిగా ఉన్నప్పటికీ, దేశీయ ఉత్పత్తి మాత్రం నామమాత్రంగానే ఉంది. దేశం ఏటా కేవలం 1.6 టన్నుల బంగారాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తుండగా, డిమాండ్ మాత్రం 700 నుండి 800 టన్నుల వరకు ఉంటోంది. ఈ భారీ వ్యత్యాసం ప్రధానంగా భారతీయులకు ఈ పసిడిపై ఉన్న సాంస్కృతిక, సామాజిక మక్కువ వల్ల ఏర్పడుతోంది. వివాహాలు, పండుగలు మరియు శుభకార్యాల్లో బంగారం అనేది కేవలం ఆభరణం మాత్రమే కాదు, ఒక అంతస్థుకు చిహ్నంగా, పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ఈ డిమాండ్ తీర్చడానికి దేశం ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి విదేశాల నుంచి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది, ఇది దేశ కరెంట్ అకౌంట్ లోటుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ఆర్బీఐ బంగారం కొనడం అనేది దేశం యొక్క 'అత్యవసర నిధి'ని సిద్ధం చేసుకోవడం వంటిది. కానీ ప్రజలు బంగారం కొనడం అనేది దేశం కరెన్సీ బలాన్ని తగ్గించడం వంటిది. అందుకే, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రధాని ఇచ్చిన పిలుపును ఒక బాధ్యతగా స్వీకరించాలని నిపుణులు చెబుతున్నారు.

# దిగజారిన మునీర్..

**ముద్ర డెస్క్:**

గతేడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. పాకిస్తాన్ ప్రతిదాడులను తిప్పికొట్టింది. అయితే మన దాడికి వణికిపోయిన పాకిస్తాన్ అమెరికాతో చేసిన లాబీయింగ్ ఇప్పుడు బయటపడింది. ఇది పాకిస్తాన్ బలహీనతకు ప్రత్యక్ష సాక్ష్యం.

**పకడ్బందీ లాబీయింగ్..**

అమెరికా చొరవతోనే ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందని, కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ తాజాగా ప్రకటించారు. ప్రాంతీయ శాంతి కోసమే పాకిస్తాన్ ఇందుకు అంగీకరించిందని వెల్లడించాడు. కానీ యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ ఫెరా(FARA) పత్రాలు ఈ ప్రకటనను డొల్లుగా మార్చాయి. నిజం ఏమిటంటే.. పాకిస్తాన్ అమెరికా సాయం కోసం 60 సార్లకుపైగా లాబీయింగ్ చేసింది. ఇది దౌత్య విజయం కాదు, దౌత్య బలహీనతకు నిదర్శనం.

**30 సార్లు సంప్రదింపులు..**

మే 6 అర్ధరాత్రి భారత్ సైనిక దాడులతో షాక్ అయిన పాకిస్తాన్ అమెరికాతో సుమారు 30 సార్లు వేర్వేరుగా సంప్రదింపులు చేపట్టింది. పాక్ అంబాసిడర్ అమెరికా నేతలతో సమావేశాల కోసం ప్రయత్నాలు చేసింది. మే 7–8న ఉద్రిక్తతలపై చర్చించేందుకు లాబీయింగ్ చేసింది. మే 9న లాబీయింగ్‌ను మరింత పెంచి, రక్షణ, జాతీయ భద్రత వ్యక్తులతో 20–25 సార్లు సంప్రదించింది. అమెరికా మీడియా జర్నలిస్టులతో భేటీలు జరిపింది.

**సైనిక దెబ్బకు బలహీనపడిన పాక్**

భారత్ సైనిక చర్యలకు పాక్ ఎంతగా భయపడిందో లాబీయింగ్ పరిమితి నుంచి స్పష్టమవుతోంది. మొత్తం 50సార్లకుపైగా అమెరికాను సంప్రదించడం, 60 మంది అధికారులను సంచరించడం నిదర్శం.

**దౌత్య వ్యూహాల్లో తేడా..**

వాషింగ్టన్‌లో భారత్, పాక్ కార్యకలాపాలకు పూర్తి వ్యత్యాసం కనిపించింది. ఉగ్రవాదాన్ని ఖండించడం, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా దౌత్యపరమైన మద్దతు కూడగట్టడం. మూడో పక్షం జోక్యాన్ని వ్యతిరేకిస్తూ భారత్ తొలి నుంచే వస్తోంది. పాకిస్తాన్ మాత్రం అమెరికా మద్దతు కోరడం, మధ్యవర్తిత్వం కోరడం, కశ్మీర్‌ను అంతర్జాతీయత చేయడం. ఇదే రెండు దేశాల మధ్య తేడా.

**బలహీనతకు లొంగిపోవడం**

పాక్ ప్రకటనలు 'ప్రాంతీయ శాంతి కోసం' అని చెప్తున్నాయి. కానీ నిజం మరొకటి: ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కంగుతిన్న పాక్ చివరకు కాళ్లబేరానికి వచ్చింది. ఈ పరిస్థితిలోనే భారత్ ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించింది. ఇది భారత్ బలహీనత కాదు. ఇది భారత్ దౌత్య విజయం.

**కచ్చితమైన దాడులు..**

ఆపరేషన్ సిందూర్ భారత్ సైనిక సమర్థతను చాటింది: ఇచ్చిన పనిని పర్ఫెక్ట్‌గా పూర్తి చేశాం. పీవోకేసహా పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రకేంద్రాలను కకావికలం చేసి పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పింది. ఆసిమ్ మునీర్ ప్రకటనలు డొల్లు అని తేలిపోయాయి. పాక్ ఎంతగా దిగజారిపోయిందనే విషయం వెలుగు చూసింది. 60సార్లకుపైగా లాబీయింగ్ చేయడం బలహీనతకు లక్షణం. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక విజయం కాదు, దౌత్య విజయం కూడా.. భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. పాకిస్తాన్ మెడలు వంచింది.

# స్టాలిన్ వద్దకు సీఎం విజయ్..

## ప్రభుత్వాన్ని కాపాడడానికి పెద్ద ప్లాన్

**ముద్ర డెస్క్ :**

ఇల్లు అలకగానే పండగ కాదు అంటారు. ఈ సామెతను పెద్దవాళ్లు ఎందుకు వాడారో తెలియదు గాని.. తమిళ రాజకీయాలను చూస్తే అర్థమవుతోంది. ఎందుకంటే తమిళనాడు ముఖ్యమంత్రిగా అట్టహాసంగా విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. అనేక పార్టీల కలబోతతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల బాగానే ఉంది గాని.. బల పరీక్షలో నిలబడటమే ఇప్పుడు విజయ్ ముందున్న అసలు సవాల్. ఇప్పటికే గవర్నర్ రాజేంద్ర అనేక సందర్భాల్లో విజయ్ కి చుక్కలు చూపించారు. రెండుసార్లు మద్దతు లేఖలు లేవని వెనక్కి పంపించారు. చివరిగా మూడోసారి అతి కష్టం మీద విజయ్ మద్దతు లేఖలు సంపాదించి గవర్నర్ ఎదుట ప్రదర్శిస్తే.. దానికి ఒప్పుకున్నారు.

చివరికి ఆదివారంనాడు చెన్నైలో విజయ్ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. ఇతర అతిరథ మహారధులు హాజరయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. అసెంబ్లీలో బల నిరూపణ సమయంలో తన బలాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం విజయ్ ముందు ఉంది. మంగళవారం జరిగే అసెంబ్లీలో తన బలాన్ని గవర్నర్ ముందు చూపించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికైతే తన చేతిలో ఉన్న ఎమ్మెల్యేల బలంతో విజయ్ తన బలాన్ని చూపించుకోవచ్చు.. కానీ ప్రమాణ స్వీకారం పూర్తయిన తర్వాత వీసీకే తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. కమ్యూనిస్టులు కూడా తోక జాడించే ప్రయత్నం చేశారు. ఐయూఎంఎల్ కూడా ఏవేవో మాటలు మాట్లాడింది. ఇవన్నీ కూడా విజయ్ ని ఇబ్బంది పెట్టాయని వార్తలు వస్తున్నాయి. అందువల్లే విజయ్ మరో మార్గాన్ని ఎంచుకున్నారు.

తనకు రాజకీయ అనుభవం లేదని.. రాజకీయంగా లౌక్యం తెలియదని అంటున్న విశ్లేషకులకు ఒక్కసారిగా సమాధానం చెప్పారు. తను ఏకంగా మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో స్టాలిన్ కుమారుడు ఉదయ నిధి కూడా ఉన్నారు. ఉదయ నిధికి, విజయ్ కి బలమైన బంధం ఉంది. రాజకీయంగా కూడా విజయ్ డీఎంకే మీద ఇంతవరకు ఎటువంటి ఆరోపణ చేయలేదు. పైగా ఇటీవల స్టాలిన్ కూడా ప్రభుత్వానికి ఆరు నెలల పాటు సమయం ఇస్తామని.. ఆడవాళ్లకు ప్రతినెల 2500 ఇవ్వకపోయినా పర్వాలేదు.. తమలగా 1000 రూపాయలు ఇచ్చినా చాలని స్టాలిన్ అభిప్రాయపడ్డారు. గ్యాస్ సిలిండర్లు కూడా ఇస్తే సంతోషిస్తామని వ్యాఖ్యానించారు..

ఒకవేళ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు, ముస్లిం లీగ్, వీసీకే మద్దతు ఇవ్వలేని పక్షంలో.. డీఎంకే సపోర్ట్ కోసమే విజయ్ అక్కడికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఒకవేళ గనుక డీఎంకే విజయ్ పార్టీకి సపోర్ట్ చేస్తే అప్పుడు తమిళనాడులో ప్రతిపక్షంగా అన్నా డీఎంకే ఉంటుంది. అన్నా డీఎంకే లో కూడా ఇటీవల చీలిక వర్గం ఏర్పడినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఆ వర్గం కూడా విజయ్ పార్టీకి సపోర్ట్ చేస్తే .. తమిళనాడులో రాజకీయాలు మరోవైపు టర్న్ తీసుకుంటాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 12.05.2026
www.mudranews.in | @mudranews



## మైగ్రేన్ నొప్పి నివారణ..

తగినంత నీరు తాగడం:
శరీరంలో నీటి శాతం తగ్గడం (డీహైడ్రేషన్) వల్ల తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. రోజంతా సరిపడా నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం



## కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ చర్చ
- పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు
- దేశంలోని ఉత్తమ వేతన విధానాలను అమలు చేస్తాం
- త్వరలో కార్మికులకు మేలు చేసే నిర్ణయాలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను మెరుగు పరిచేందుకు, వారికి మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ సెక్రెటరి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో వేతనాల సవరణ శాస్త్రీయంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతనాల విధానాలను కమిటీ కూలంకషంగా పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకురానున్న నూతన 'లేబర్ కోడ్' అంశాల ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికుల వేతనాలను కేవలం అంకెల్లో కాకుండా, వారి వాస్తవ అవసరాలకు అనుగుణంగా సవరించాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ నిర్ణయించింది. దేశంలోని అత్యుత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం ధృఢ సంతకల్పంతో ఉందని అభిప్రాయ పడింది. తెలంగాణను కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. త్వరలోనే అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి, కార్మికులకు మేలు చేకూర్చే విధంగా కనీస వేతనాల సవరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

## మోడీ సభతో తెలంగాణలో బీజేపీకి కొత్త ఊపు

- మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్



**ముద్ర, హైదరాబాద్ :** ప్రధాని మోడీ సభ తో తెలంగాణలో బీజేపీకి కొతhs ఊపు వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ లోని గాయత్రి గార్డెన్లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని సభకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు తరలివచ్చారని, సభా ప్రాంగణంలోనే కాకుండా బయట కూడా భారీగా జనసందోహం కనిపించింద న్నారు. ముఖ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి ప్రజలు అత్యధికంగా హాజరయ్యారన్నారు. మేడ్చల్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మోర్చా నాయకులు, డివిజన్ స్థాయి కార్యకర్తలు, అపార్ట్మెంట్ అసోసియేషన్లు, నార్త్ ఇండియా సమాజం సహకారంతో సభ విజయవంతమైందని తెలిపారు. ఈ సభ ద్వారా రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే సంకేతాలను ప్రధాని ఇచ్చారన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో నుంచి బయటపడాలన్నా, రైతులు, విద్యార్థుల సమస్యలు పరిష్కారమవ్వాలన్నా బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

## హ్యామ్ ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష



**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ సచివాలయంలో సోమవారం హ్యామ్ ప్రాజెక్టుల పురోగతిపై ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మూడు గంటల పాటు అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో చేపడుతున్న రహదారి పనుల నాణ్యత, నిర్మాణ వేగం, టెండర్ ప్రక్రియపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఏఐ అమలు చేస్తున్న హ్యామ్ మోడల్‌ను మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయని అధికారులు వివరించారు. తెలంగాణలో కూడా 6,092 కిలోమీటర్ల మేర 34 ప్యాకేజీలుగా రూ.13,006 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేల నుంచి రూ.89 వేల వరకు పెరగడం, జీఎస్టీ భారం, మెయింటెనెన్స్ ఖర్చులు, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ప్రాజెక్టు వ్యయాలు పెరిగాయని వెల్లడించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఎక్సెస్ టెండర్లు తక్కువగానే ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి నాణ్యమైన రహదారులు కీలకమన్న మంత్రి, హ్యామ్ ప్రాజెక్టుల తుది అంశాలపై సీఎంతో చర్చించనున్నట్లు తెలిపారు.

## కొండగట్టు గిరి ప్రదక్షిణకు సౌకర్యాలు కల్పిస్తాం

- పెద్ద హనుమాన్ జయంతికి అన్ని ఏర్పాట్లు
- కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు
- స్వామి వారికి పట్టు వస్త్రాలు
- పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ పూజారులు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో సోమవారం మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంత్రి అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి వారు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కొండగట్టు అంజన్న గిరి ప్రదక్షిణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరి ప్రదక్షిణ భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ, పోలీసు శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులు సమన్వయం చేసుకొని ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకోవాలి మంత్రి అడ్లూరి సూచించారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై, తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. జిల్లా అధికారులు స్థానికంగా ఉండి భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

## రేవంత్ రెడ్డి.. బండి సంజయ్ ది ఫెవికాల్ బంధం

**బండి సంజయ్ నైతికంగా మంత్రిగా కొనసాగే హక్కు లేదు**
**రేవంత్ రెడ్డి హోమ్ శాఖ మంత్రిగా ఉండి పట్టించుకోవటంలేదు**
**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లది ఫెవికాల్ బంధమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బేటి బచావో అని నినాదం చేస్తూ.. ఆడబిడ్డకు అన్యాయం చేసిన బండి సంజయ్ ను పక్కన కూర్చోపెట్టుని ప్రధాని మోదీ మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. బండి సంజయ్ తనయుడు భగీరథ చేసిన నేరానికి 20 ఏళ్ల శిక్ష పడుతుందని, నేరాన్ని కప్పిపుచే ప్రయత్నం చేసిన బండి సంజయ్ సైతం శిక్షార్హులు అవుతారని అన్నారు. బండి సంజయ్ బాధ్యత రాహిత్యంతో నైతికంగా మంత్రిగా కొనసాగే హక్కు లేదని, ఏ మాత్రం నైతిక విలువలు ఉన్న మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రమశిక్షణ గల కార్యకర్త గా ఎదిగిన నాయకుడిగా నీ కుటుంబాన్ని క్రమశిక్షణ నేర్పించలేనప్పుడు దేశానికి ఏం క్రమశిక్షణ నేర్పిస్తావు అని ప్రశ్నించారు. వాస్తవాలు మాట్లాడితే కరీంనగర్ లో ఎమ్మెల్యే నివాసం పై దాడి చేయించావు ఇదేనా నీ క్రమశిక్షణ అంటూ బండి సంజయ్ పై మండి పడ్డారు. అలాగే మైనర్ బాలిక సంఘటన పై కనీసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోమ్ శాఖ మంత్రిగా ఉండి పట్టించుకోవటంలేదని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లది ఫెవికల్ బంధమని అన్నారు. మోదీ అండ ఉందని, సీఎం రేవంత్ రెడ్డి కళ్ళకు గంతలు కట్టుకున్నాడని ఎద్దేవ చేశారు. భగీరథ్ పై ఉద్దేశ పూర్వకముగా నేరానికి అనుగుణమైన సెక్షన్లు పెట్టకుండా తప్పించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ను సస్పెండ్ చేయాలన్నారు. ఆడబిడ్డ పై అఘాయిత్యం జరిగితే పీసీసీ కనీసం ఖండించలేదని, రాష్ట్రంలో ఏ ఆడబిడ్డకు అన్యాయం జరిగిన న్యాయం జరిగే వరకు బీ ఆర్ ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంతసురేష్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు
- ధాన్యం తరలింపులో సమన్వయంతో పనిచేయాలి
- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి
- సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**
రైతు శ్రేయస్సే రాష్ట్ర ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రబీ 2025-26 సీజన్ వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షెడ్లు, గన్నీ బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు, రవాణా వాహనాలు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. తేమ శాతం పేరుతో రైతులను వేధించరాదని హెచ్చరించారు. రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం వేసి కొనుగోలు పూర్తి చేయాలని చెప్పారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు సమయానికి స్పందించాలని సూచించారు. రైతులకు అన్యాయం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు ప్రతి మండలంలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో రబీ సీజన్‌లో 1,87,418 ఎకరాల్లో సాగు జరగగా, దాదాపు 1.20 లక్షల మంది రైతుల నుంచి 4,44,033 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం అవసరమైన గోదాములు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కారును ఢీ కొన్న బైక్ : ఐదుగురి దుర్మరణం



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** మహబూబ్ నగర్ పట్టణం సమీపలోని బై పాస్ రహదారి పై ఆదివారం అర్ధరాత్రి కారును బైక్ ఢీ కొన్న సంఘటనలో లో ఐదుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ కు చెందిన బైకర్ యాకుబ్ అఫ్జల్(25) ఫ్రెండ్ తో కలిసి స్పోర్ట్స్ బైక్ పై మహబూబ్ నగర్ నుంచి బై పాస్ రహదారి మీదుగా వెళుతున్న సమయంలో పాలకొండ చౌరస్తా వద్ద మలుపు తీసుకుంటున్న కార్ ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదం లో కార్ పాల్టీలు కొట్టింది. బైక్ పై ఉన్న ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందారు. కార్ లో ఉన్న ఐదుగురిలో ముగ్గురు ఉజేప (7), అమర్ (2), అర్షియా బేగం(30) కారులో ఇరుక్కుని మృతిచెందారు. ఇద్దరు గాయపడ్డారు. మహబూబ్ నగర్ పట్టణం లోని ప్రేమ్ నగర్ కు చెందిన వీరు బై పాస్ రహదారిలోని పిస్తా హౌస్ హోటల్ లో బర్త్ డే పార్టీ చేసుకుని తిరుగు ప్రయాణంలో పాల కొండ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుం టుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి రూరల్ పోలీసులు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రి కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. నిత్యం రద్దీతో ఉండే బైపాస్ రోడ్డుపై కొంతమంది యువకులు స్పోర్ట్స్ బైకలతో రేసింగ్ నిర్వహించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. రాత్రి వేళల్లో బైక్ రేసింగ్‌లు, స్టంట్లు పెరిగి పోతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లో విఫలమవుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన తర్వాతైనా పాలకొండ బైపాస్‌పై పోలీస్ నిఘా తీవ్రతరం చేసి, కట్టుదిట్టమైన ట్రాఫిక్ నిబంధనలతో నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల నుంచి మొదలుకొని మండల, గ్రామ స్థాయి వరకు ప్రతి వార్డులో పార్టీ జెండాలు ఎగురవేసి, పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను నేడు మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకొని ఉద్యమిస్తుందని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఉద్యమిద్దాం తెలంగాణ తెచ్చుకుంటే బతుకులు మారుతాయని అనుకున్న ప్రతివర్గం కూడా ఇప్పుడు తీవ్ర నిస్పృహలో ఉందని విచారం వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉద్యమించిన మనమంతా కూడా ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ రక్షణ సేన జెండాను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలనీ పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ ఆవిర్భావానికి మూడు నెలల ముందు నుంచే పెద్ద ఎత్తున చేరిన నాయకత్వంతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు సమన్వయంతో జెండా పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 12.05.2026
www.mudranews.in | @mudranews



### మైగ్రేన్ నొప్పి నివారణకు ఇవి పాటించండి

**తగినంత నీరు తాగడం: శరీరంలో నీటి శాతం తగ్గడం (డీహైడ్రేషన్) వల్ల తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. రోజంతా సరిపడా నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం.**



# ఇక అమెరికా సూపర్ పవర్ కాబోదు...!

ఒక గాజు బోనులో ఉన్న విషసర్పాల మధ్య చనిపోయిన ఎలుకను పడేయగానే అవన్నీ పరస్పరం దాడులు చేసుకొని చివరకు ఒక్క పాము మాత్రమే మిగిలిన కథ మన ప్రపంచ రాజకీయాలకు ప్రతిబింబంలా కనిపిస్తుంది. బలమైన శక్తులు బలహీన దేశాలను పరస్పరం ఘర్షణలకు దింపి చివరికి తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలనే ప్రయత్నం చరిత్రలో ఎన్నోసార్లు జరిగింది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచం రెండు ధృవాలుగా విడిపోయింది. సోవియట్ యూనియన్ పతనం తరువాత అమెరికా ఏకైక సూపర్ పవర్‌గా ఎదిగి తన విధానాలకు వ్యతిరేకంగా ఉన్న దేశాలపై యుద్ధాలు, ఆంక్షలు, జోక్యాలతో ఆధిపత్యం చాటుకోవాలని చూసింది. ఇరాక్, సిరియా, లిబియా, వెనిజులా వంటి దేశాలు దీని ప్రభావాన్ని ఎదుర్కొన్నాయి. ఇప్పుడు ఇరాన్ విషయంలో కూడా అదే విధానం కనిపిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

చరిత్రను పరిశీలిస్తే శాశ్వత ఆధిపత్యం ఎవరికీ నిలవ లేదు. రోమన్ సామ్రాజ్యం, మంగోలులు, మొఘలులు, ఒట్టోమన్ సామ్రాజ్యం, బ్రిటీష్ సామ్రాజ్యం, చివరకు సోవియట్ యూనియన్ కూడా అంతర్గత విభేదాలు, యుద్ధాలు, విస్తరణవాదంతో కూలిపోయాయి. ప్రపంచాన్ని శాసించాలని చూసిన హిట్లర్ కలలు కూడా బంకర్‌లోనే ముగిశాయి.

ఇప్పటి అమెరికా పరిస్థితి కూడా అలాంటిదే. ఇజ్రాయిల్‌కు మద్దతు గా ఇరాన్‌పై ఒత్తిడి తేవడం, పాలస్తీనా విషయంలో మౌనం పాటించడం, యుద్ధాలకు భారీగా ఖర్చు చేయడం ప్రపంచ శాంతికి ప్రమాదకరమని పేర్కొంటున్నారు. అమెరికా ఒకప్పుడు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడినా, ఇప్పుడు అదే ఆధిపత్య రాజకీయాలను అనుసరిస్తోందనే విమర్శ వ్యక్తమవుతోంది.

ప్రపంచ చరిత్ర చెప్పే సత్యం ఏమిటంటే యుద్ధాలు, విస్తరణలు, అధికారం మీద మోజు చివరకు ఏ సామ్రాజ్యాన్నైనా బలహీనపరుస్తాయి. అందుకే ప్రపంచ శాంతికి యుద్ధాలు కాదు, పరస్పర గౌరవం, సహకారమే మార్గమని రచయిత ప్రశ్నిస్తున్నారు.

**- డా.మహ్మద్ హసన్**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**రాజనీతి విశ్లేషకులు**
**సెల్:9908059234.**



## మత్తు పదార్థాల అక్రమ రవాణా సంపూర్ణ నిషేధం


**సినిమా తరహాలో సోలాపూర్ టీం గంజాయి సరఫరా**
**ఏడుగురు అరెస్టు, రూ.రెండు కోట్ల విలువచేసే సమాగ్రి స్వాధీనం**



**ముద్ర, శేరిలింగంపల్లి:** ' శేరిలింగంపల్లి పోలీసులు భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి, పటాన్‌చెరు స్పెషల్ ఆపరేషన్ టీమ్స్ సంయుక్తంగా నిర్వహించిన దాడిలో 400 కిలోల గంజాయి, ఒక డీసీఎం వాహనం, కారు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసు కున్నారు. వీటి విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుందని శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ముద్ర అడిగిన ప్రశ్నకు శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ కేసులో సోలాపూర్‌కు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్ సహా ఆరుగురిని అరెస్టు చేయగా, ప్రధాన నిందితులు మనీషా పద్వాల్, ట్రిబినీ పరారీలో ఉన్నారని చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముత్తంగి ఓఆర్ఆర్ సమీపంలో దాడి చేసి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.ప్రజల సహకారం లేకుండా మాదకద్రవ్యాల నియంత్రణ సాధ్యం కాదని డీసీపీ శ్రీనివాస్ అన్నారు. డీసీపీ ఎస్వోటీ సైబరాబాద్ పి.శోభన్ కుమార్, అదనపు డీసీపీ ఎ.విశ్వప్రసాద్ పర్యవేక్షణలో పటాన్ చెరువు ఎస్.హెచ్.వో జి.వినాయక్ రెడ్డి, డీఐ బి.రాజు, ఎస్.ఐ శివకుమార్ బృందం కృషిని సైబరాబాద్ సీపీ రమేశ్ రెడ్డి అభినందించారని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు పోలీసులకు సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. గచ్చిబౌలి ఏసీపీ శ్రీధర్, ఇన్స్ పెక్టర్ బాల్ రాజ్ పాల్గొన్నారు.

## 2047 నాటికి 2.4 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా ఏపీ

**- సీఎం చంద్రబాబు**




**ముద్ర, అమరావతి:** భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా సంస్థలు, ప్రభుత్వం, పారి శ్రామిక రంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను విద్యా సంస్థలు సిద్ధం చేశాయి, ప్రభుత్వాలు పెట్టుబడులు తీసుకురావాలని అన్నారు. ఈ మూడు రంగా లు కలిసే పనిచేస్తేనే దేశం ఆశించిన ఫలితాలు సాధించగలదన్నారు.

గ్లోబల్ టెక్ రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరాలంటే పరిశోధన, స్కిల్లింగ్, స్టార్టప్‌లు, మాన్యుఫాక్చరింగ్, గవర్నెన్స్, ఇన్నోవేషన్ వంటి సమీకృత విధానాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పట్టభద్రులను ఉద్యోగాలకు సిద్ధం చేయడానికి నెలల తరబడి సమయం వృథా చేస్తే లక్ష్యాలను చేరుకోలేమని, ఎంప్లాయబిలిటీని జాతీయ మిషన్ గా గుర్తించారు.2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు. గత 22 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలను తీసుకురాగలిగామని. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తిని ఏపీలోనే సాధించే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు.

విశాఖపట్నంలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి తో డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశామని, రిల యన్స్ ఇండస్ట్రీస్ వంటి సంస్థల డేటా సెంటర్ రంగంలో పెట్టుబడులకు ముందుకొచ్చాయని తెలి పారు. అలాగే రిన్యూ పవర్ ఇంగాట్ సోలార్ వేఫర్ తయారీకి ముందుకు వచ్చింది.రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని ఇప్పటికే 30 పైసలు తగ్గించామని, త్వరలోనే రూ.1.30 వరకు తగ్గించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాలతో ప్రభుత్వం పనిచేస్తుంది.టెక్నాలజీ ఆధారిత నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని, నెట్ జీరో కాన్సెప్ట్‌తో రాజ ధాని నిర్మాణం కొనసాగుతోందని సీఎం పేర్కొ న్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు.

## గుప్తనిధుల కోసమే కాకతీయుల శివాలయం కూల్చివేత

**బడి పేరుతో గుడిని కూల్చిన రేవంత్ రెడ్డి.. లంక బిందెల వేటలో 24 అడుగుల తవ్వకాలు**
**ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో 500 కోట్ల భారీ కుంభకోణం.. అన్నీ ఎక్సెస్ టెండర్లే.**
**అశోక్ నగర్‌లో ధ్వంసమైన మట్టికోట శివాలయాన్ని పరిశీలించిన హరీశ్ రావు**



**ముద్ర, వరంగల్ :** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని అశోక్ నగర్ గ్రామంలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయుల నాటి మట్టికోట శివాలయాన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో ధ్వంసం చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ధ్వంసమైన ఆలయాన్ని సందర్శించిన ఆయన, అర్ధరాత్రి గర్భగుడి కింద 24 అడుగుల లోతులో తవ్వకాలు జరిపి గుప్త నిధుల కోసం కుట్ర పన్నారని విమర్శించారు. పురావస్తు శాఖ ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో దాదాపు రూ.500 కోట్ల అవినీతి జరిగిందని.. అన్ని టెండర్లు ఎక్సెస్ రేట్లకే కేటాయించారని ఆరోపించారు. చారిత్రక శివాలయాన్ని పునరుద్ధరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన సీఎం చంద్రబాబు



ముద్ర, అమరావతి : ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ముఖ్యంగా కేంద్ర సహకారంతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, రాష్ట్రానికి అవసరమైన నిధులపై సీఎం చంద్రబాబు అమిత్ షాతో మాట్లాడినట్లు సమాచారం.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వైభవంగా ముగిసిన 'సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం'



**ముద్ర, కరీంనగర్ :** స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో గత ఐదు రోజులుగా ఆధ్యాత్మిక పరిమళాల మధ్య కొనసాగిన 'సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం' సోమవారం ఘనంగా ముగిసింది. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగింపు వేడుకలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, సుందరకాండ కేవలం ఒక కావ్యం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి జీవితంలో విజయాన్ని చేకూర్చే అద్భుత శక్తి అని కొనియాడారు.

ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ మహేశ్వర శర్మ ప్రసంగిస్తూ భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లని పేర్కొన్నారు. శ్రీరాముని అడుగుజాడల్లో నడుస్తూ ధైర్యవంతులుగా, గుణవంతులుగా ఎదగాలని కోరారు. ముఖ్య అతిథి డాక్టర్ రాజభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు విలువలను బోధించడం అభినందనీయమన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించేలా ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని జరగాలని ఆకాంక్షించారు.ముగింపు వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు భక్తులను, అతిథులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.రెడ్డి సంఘం నాయకులు సంధి తిరుపతి రెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు, విద్యార్థులకు ప్రసాద వితరణ (అల్పాహారం) ఏర్పాటు చేశారు.

## ఇది టీమిండియా యుగం!

**ఐసీసీ ర్యాంకింగ్స్, టైటిళ్లలో టీమిండియా నంబర్ వన్!- వన్డే, టీ20ల్లో భారత్ అగ్రస్థానం**

ముద్ర డెస్క్ : అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగిస్తూ ప్రపంచ నంబర్ వన్ జట్టుగా అవతరించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో 118 పాయింట్లతో భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. న్యూజిలాండ్ (113), ఆస్ట్రేలియా (109) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. వైట్ బాల్ క్రికెట్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. రోహిత్ శర్మ సారథ్యంలో 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న భారత్, తాజాగా సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో 2026 టీ20 వరల్డ్ కప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. దీంతో మూడు టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన తొలి జట్టుగా టీమిండియా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ప్రస్తుతం వన్డే, టీ20ల్లో అగ్రస్థానంలో ఉన్న భారత్, టెస్టుల్లో మూడో స్థానంలో కొనసాగుతోంది. ప్రపంచ క్రికెట్‌లో ఇప్పుడు "టీమిండియా యుగం" నడుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సోమనాథ్ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారు

**ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు**

ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గుజరాత్ (Gujarat) లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '1951లో సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ కేవలం ఒక సాధారణ విషయం కాదు. అది భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక' అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆలయ పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ల సేవలను ప్రధాని కొనియాడారు. దేశంలోని 500కు పైగా సంస్థానాలను ఏకంచేసి ఆధునిక భారతాన్ని నిర్మించిన సర్దార్ పటేల్, సోమనాథ్ పునర్నిర్మాణం ద్వారా మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందుతున్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారని మోదీ



వివరించారు.అయితే ఈ మహత్కార్యానికి నెహ్రూ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని మోదీ ఆరోపించారు. 'ఆలయ పునర్నిర్మాణం కోసం సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ఎంతో కృషిచేశారు. కానీ వారికి నెహ్రూజీ నుంచి ఎంత వ్యతిరేకత వచ్చిందో మనందరికీ తెలుసు. ఈ రోజు నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. కానీ సర్దార్ పటేల్ సంకల్పం ముందు ఏదీ నిలవలేదు. శతాబ్దాల అవమానాన్ని చెరిపేస్తూ సోమనాథ్ ఆలయం పునర్నిర్మితమైంది..' అన్నారు. జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చే శక్తులు ఇప్పటికీ ఉన్నాయన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**ముద్ర, కోరుట్ల:** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన మాడవేణి నవీన్ 25 అనే యువకుడు గత కొన్ని సంవత్సరాల నుండి మానసిక పరిస్థితి బాగాలేక గతంలో పలుమార్లు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అదే క్రమంలో ఆదివారం రోజు అర్ధరాత్రి తన ఇంటిలో ఉన్న ఫ్యాన్కి చీరతో ఉరివేసుకొని చనిపోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. మృతిని తండ్రి అయిన మాడవేని నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై తెలిపారు.

# హిందూ ఏక్తా యాత్రకు సర్వం సిద్ధం

**రాష్ట్రం నలమూలల నుండి తరలి రానున్న కాషాయ సైనికులు**
**ఏక్తా యాత్ర ర్యాలీకి సిద్ధమైన కరీంనగర్ ప్రజలు**

**ముద్ర, కరీంనగర్** : హిందూ ఏక్తా యాత్రకు సర్వం సిద్ధమైంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హిందూ ఏక్తా యాత్ర'కు రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చేందుకు కాషాయ శ్రేణులు సిద్ధమయ్యాయి. మరోవైపు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఊరూవాడా నుండి తరలివచ్చి హిందూ ఏక్తా యాత్రను వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మరోవైపు హిందువులందరినీ సంఘటితం చేయడమే లక్ష్యంగా ప్రతి ఏటా బాల గంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను ప్రారంభించిన




సంగతి తెలిసిదే. అదే స్ఫూర్తితో హిందువులందరినీ రాజకీయాలకు అతీతంగా సంఘటితం చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 16 ఏళ్ల క్రితం బండి సంజయ్ కుమార్ గుప్పెడు మందితో కరీంనగర్ లో ''హిందూ ఏక్తా యాత్ర''ను ప్రారంభించారు. ప్రతి ఏటా హిందూ ఏక్తా యాత్రకు వచ్చే హిందువుల సంఖ్య పెరుగుతూనే ఉంది. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**గతంకంటే మిన్నగా...**

గతానికి భిన్నంగా ఈసారి 'హిందూ ఏక్తా యాత్ర'కు రావాలంటూ కాషాయ శ్రేణులు, కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

**వేసవిలో ఇబ్బంది లేకుండా....**

బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈనెల 12న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ లోని వైశ్యా భవన్ నుండి ప్రారంభమయ్యే ఏక్తా యాత్ర కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు జనం ఉత్సాహం చూపుతుండటంతో వారికి ప్రత్యేకంగా రవాణా సదుపాయం కల్పించేందుకు కాషాయ శ్రేణులు సిద్ధమయ్యాయి. మరోవైపు ఎండాకాలం కావడంతో ఏక్తా యాత్రలో పాల్గొనే వారికి కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదులు, వ్యాపారులు స్వచ్ఛందంగా మంచినీళ్లు, మజ్జిగ, ఇతర ఆహార పానియాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు.

**హిందూ ఏక్తా యాత్ర ఆరంభమయ్యేది ఇలా...**

కరీంనగర్లోని వైశ్య భవన్ నుండి 12న సాయంత్రం 4 గంటలకు హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ ప్రారంభం కానుంది. ర్యాలీ ఆరంభంలోనే వైశ్యాభవన్ వద్ద హిందుత్వ వాదులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగిస్తారు. అనంతరం వైశ్యా భవన్ నుండి ప్రారంభమయ్యే ర్యాలీ రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్ , వన్ టౌన్, వెంకటేశ్వర టెంపుల్, అమరవీరుల స్థూపం, జయశంకర్ సర్కిల్, రాజీవ్ చౌక్ మీదుగా తిరిగి వైశ్య భవన్ కు చేరుకుంటుంది. ఇక్కడే హిందూ ఏక్తా యాత్రను ముగిస్తారు. ఈ యాత్రకు కులాలను పక్కన పెట్టి హిందువులంతా రావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల కార్యకర్తలంతా ఈ యాత్రకు హాజరవుతుండటం విశేషం. ముఖ్యంగా వివిధ కుల సంఘాల నాయకులంతా సంఘీభావం తెలిపారు. వీరితోపాటు వివిధ వృత్తి సంఘాలు, ధార్మిక సంస్థలు, కళాకారులు, కార్మిక సంఘాల నాయకులు ఈ యాత్రలో పాల్గొనబోతోన్నాయి.

**కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఆకట్టుకోనున్న కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు**

దాదాపు 6 గంటలపాటు కొనసాగే హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనే హిందుత్వ వాదులు, కరీంనగర్ పట్టణ ప్రజలను ఆకట్టు కునేలా వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కేరళ నుండి హనుమంతుడు, హైదరాబాద్ నుండి శ్రీరాముడి విగ్రహాలను కరీంనగర్ కు తరలిస్తున్నారు. ఢిల్లీ నుండి ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకునే కళాకారులను రప్పిస్తున్నారు. కేరళ నుండి డప్పు వాయిద్య కళాకారులు వస్తున్నారు. ప్రత్యేకంగా సిరిసిల్ల నుండి ప్రతి ఏటా ధ్వజాలు రాబోతున్నాయి.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 12-05-2026
www.mudranews.in | @mudranews



### మైగ్రేన్ నొప్పి నివారణకు ఇవి పాటించండి

**ఐస్ ప్యాక్ వాడటం:** మెడ వెనుక లేదా నుదుటిపై ఐస్ ప్యాక్ తో కాపడం పెట్టుకోవాలి. ఇది రక్త నాళాలను కుంచించుకు పోయే లా చేసి నొప్పి తీవ్రతను తగ్గిస్తుంది.



## కళాశాలకు సీసీ రోడ్డు ప్రారంభం

### - విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజా పాలన – 99 రోజుల ప్రగతి ప్రణాళిక" లో భాగంగా నాగర్ కర్నూల్ పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే నిధుల నుంచి బెంచీలను పంపిణీ చేశారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేలా ప్రభుత్వ విద్యా సంస్థలను మరింత అభివృద్ధి చేయడం తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, కౌన్సిలర్లు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతిని ధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, తిమ్మాజిపేట:** తిమ్మాజిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వివేక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి, హర్షవర్ధన్, లక్ష్మీనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

### - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ముద్ర, కాప్రా:** బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి కుమారుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత బాలికకు న్యాయం చేయాలని కోరారు. సోమవారం ఉప్పల్‌లోని నిచ్చిల్కానగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన లక్ష్మారెడ్డి, బండి సంజయ్ కుమారుడు భగీరత్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికీ ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నిందితుడిని ఎందుకు అరెస్ట్ చేయట్లేదు?

### - మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

**ముద్ర, నారాయణపేట:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్‌పై పోక్సో కేసు నమోదైనా ఇప్పటికీ ఎందుకు అరెస్ట్ చేయలేదని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు. "బడే బాయ్–చోటే బాయ్"గా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా అని విమర్శించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య బీఆర్ఎస్ కార్యకర్త సోషల్ మీడియాలో పోస్టు పెడితే ఐదుగురు ఐపీఎస్ అధికారులతో సిట్ ఏర్పాటు చేసే ప్రభుత్వం, మైనర్ బాలిక ఫిర్యాదు చేసినా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కే సుదర్శన్ రెడ్డి, విజయ సాగర్, బుల్లెట్ రాజు, కౌన్సిలర్ భరత్, బోయ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జనగణన'ను ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జన గణన–2027ను మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి గాంధీ చౌక్ సమీపంలో ప్రారంభించారు. మ్యాపింగ్, నెంబరింగ్ చేసే విధానాన్ని ఎన్యూమరేటర్ ని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ అభివృద్ధి కోసం జనాభా గణనలో భాగంగా ఇండ్ల వివరాలు, సౌకర్యాలకు సంబంధించి పకడ్బందీగా చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, సూపర్వైజర్ అనిల్ కుమార్, వార్డ్ కౌన్సిలర్, బిల్ కలెక్టర్, వార్డ్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

## పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### - జిల్లా కన్వీనర్ మదన్ మోహన్

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** మే 13న నిర్వహించనున్న పాలిసెట్–2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పాలిసెట్ కన్వీనర్ మదన్ మోహన్ తెలిపారు. సోమవారం నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,911 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థుల్లో ఆదరణ పెరిగిందన్నారు. జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో 8 కేంద్రాలు జిల్లా కేంద్రంలో ఉండగా, బిజినపల్లి మండలం పాలెంలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాలను జీపీఎస్ మ్యాపింగ్ ద్వారా సులభంగా గుర్తించి చేరుకోవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్ తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

# ఇళ్ల చెత్తను మున్సిపాలిటీ ఆటోలోనే వేయాలి

### - కలెక్టర్ సిహెచ్ ప్రియాంక
### -వయోవృద్ధుల ఆశ్రమం, బాల సదనం సందర్శన



**ముద్ర, నారాయణపేట:** ఇళ్లలో పోగయ్యే చెత్తను మున్సిపాలిటీ చెత్త సేకరణ ఆటోలలోనే వెయ్యాలని, ఆరుబయట పరిసరాలలో వేయవద్దని కలెక్టర్ సిహెచ్ ప్రియాంక సూచించారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఒకటో వార్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యాచరణలో భాగంగా ఒకటో వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ ను మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగు నీరు, మురుగు కాల్వల పరిశుభ్రత ఎలా ఉందో వాకబు చేశారు. వార్డులలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ ఒకటో వార్డు బారంబావి సమీపంలో గల వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఎంతమంది వృద్ధులు ఉన్నారని, వారికి కల్పిస్తున్న వసతి సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పక్కనే ఉన్న బాలసదన్ కూడా కలెక్టర్ సందర్శించారు అక్కడున్న విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల వివ రాలను తెలుసుకున్న ఆమె ఎవరెవరు ఏ, ఏ తరగతులు చదువుతున్నారనీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల దోపిడీ ఆపాలి: ఈటల రాజేందర్



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ఉద్యోగుల సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాలు నడవవని పేర్కొంటూ, వారికి తగిన గౌరవం, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి 18 శాతం సర్వీస్ ట్యాక్స్ వసూలు చేయడం అన్యాయమని ఆయన విమర్శించారు. మధ్యవర్తి ఏజెన్సీలు ఉద్యోగులను దోపిడీ చేస్తూ, ఇష్టం వచ్చినట్లు తొలగింపులు చేస్తున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం, సమయానికి జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ఇళ్ల కిరాయిలు, పిల్లల ఫీజులు, వైద్య ఖర్చులతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈటల రాజేందర్ తెలిపారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, మరణించినప్పుడు కుటుంబానికి రూ.1 కోటి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమానికి తాను పూర్తి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు.

### రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో గెలుపు బీజేపీదే..

**ముద్ర, మల్కాజిగిరి:** ప్రధాని నరేంద్ర మోదీ సభకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు హాజరయ్యారని, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ప్రధాని సభ విజయవంతమైన సందర్భంగా కంటోన్మెంట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది రోజులుగా సహకరించిన మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపిన ఈటల రాజేందర్, మేడ్చల్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మోర్చా నాయకులు, అపార్ట్‌మెంట్ పాలక మండళ్లు, నార్త్ ఇండియా సమాజం సహకారంతో సభ విజయవంతమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో గెలుపు బీజేపీదేనని ప్రధాని సంకేతాలు ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకునే ఏకైక పార్టీ బీజేపీయేనని అన్నారు. తాను ఏడాది పొడవునా ప్రజలకు అందుబాటులో ఉంటానని, త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయటపడాలన్నా, రైతులు–విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావాలన్నా బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. "మేక్ ఇన్ ఇండియా" లక్ష్యంతో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపునిచ్చారని చెప్పారు.



## నిషేధిత పత్తి విత్తనాల విక్రయదారుడి అరెస్ట్

**ముద్ర. మల్కాజిగిరి:** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని షామీర్‌పేట్ వద్ద నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మే 10న సాయంత్రం షామీర్‌పేట్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నం. 07 సమీపంలో దాసరి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రెండు సంచుల్లో ఉన్న 100 కిలోల నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసున్నారు. ఈ ఘటనపై షామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి తెలిపారు. రక్తదానం చేయదలచిన వారు వివరాల కోసం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ. రోహిత్ (9160120821), నర్సింగ్ ఆఫీసర్ ఎం. ఆనంద్ (98850 46683), హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి. యాదగిరి (9014932408)లను సంప్రదించాలని తెలిపారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, వివిధ విభాగాలను పరిశీలించారు. విధుల్లో ఉన్న వైద్యులు, నర్సులు, సిబ్బంది హాజరు వివరాలు తెలుసుకుని, డ్యూటీల నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. రోగులకు సమయానికి వైద్యం అందించడంతో పాటు అత్యవసర సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడిన కలెక్టర్, అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, వసతులపై ఆరా తీశారు. కొంతమంది రోగులు వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని చెప్పగా, పరి శుభ్రతపై మరింత శ్రద్ధ అవసరమని మరికొందరు సూచించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ సానిటేషన్ పర్యవేక్షణ నిర్వహించాలని సూచిస్తూ, రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం వైద్యాధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు చేయకుండా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సేవాభావంతో పనిచేస్తూ రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## 'ప్రజావాణి'లో ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా 6 అర్జీలు స్వీకరించగా, అందులో భూమికి సంబంధించిన ఒక అర్జీ, తగు న్యాయానికి సంబంధించిన 5 అర్జీలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సీఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు నిర్భయంగా, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

ప్రజల సమస్యలు చట్టప్రకారం పరిష్కరించబడేలా, పోలీసులు ప్రజల కు మరింత చేరువయ్యేలా పనిచేయడం జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తోందని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు.

## మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం

### - ఏఐసీసీ కార్యదర్శి కమలాక్షి రాజన్

**ముద్ర కూకట్‌పల్లి:** మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపుతో పాటు పదవులు లభిస్తాయని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ కమలాక్షి రాజన్ పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కార్యకర్తల భారీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై కేసు నమోదైన నేపథ్యంలో బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణలత, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పుష్పా రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 12.05.2026
www.mudranews.in | @mudranews



**మైగ్రేన్ నొప్పి నివారణకు ఇవి పాటించండి:**

ఒత్తిడిని తగ్గించుకోవడం: మానసిక ఒత్తిడి మైగ్రేన్‌కు ప్రధాన కారణం. దీనిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం లేదా లోతైన శ్వాస ప్రక్రియలు పాటించాలి.



# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

**- సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర న్యూస్, వెల్గటూర్:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్ స్కూల్లో సోమవారం సమ్మర్ క్యాంప్ ను మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థులకు గొప్ప స్థాయిలో విద్యను అందించాలని లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ రంగ విద్యా సంస్థలు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేస్తున్నామని అన్నారు.

కుమ్మర్ పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు జగిత్యాల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ఉపయోగించుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

వెల్గటూరు మండలం కిషన్ రావు పేటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు పూర్తి అయ్యేవిధంగా అధికారులు చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు.

**ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి..**

**ముద్ర, బుగ్గారం:** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా బుగ్గారం, గోపులాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా కాంటాలు పూర్తయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, హమాలీల సమస్య ఉంటే అదనంగా డబ్బులు చెల్లించి కొనుగోలు పూర్తి అయ్యేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

## మహిళా సాధికారత కోసం ప్రత్యేక శ్రద్ధ




**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ఖాన్ పేట లో రూపాయలు పది లక్షలతో నిర్మించిన మహిళా సమైఖ్య భవనాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం సంబంధించిన నిధులతో నిర్మించిన మహిళా భవనం ఈ రోజు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను మహిళా సాధికారత దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తోందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.సర్పంచ్ గుర్రం సంధ్య తిరుపతి రెడ్డి ఈ సంఘ భవనం త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జగన్ మోహన్ రెడ్డి,డీఈ జనార్దన్,ఏఈ సమ్మయ్య, కంరెడ్డి రంరెడ్డి, సాయిని తిరుపతి, సర్పంచులు మోతే ప్రశాంత్ రెడ్డి,బోగొండ ఐలయ్య, కూర నరేష్ రెడ్డి,కామల్ గౌడ్,లక్ష్మి నారాయణ,రాజు,అంజయ్య, బాపు రెడ్డి, తిరుపతి, అంజయ్య, మహిళా మండల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



**మహాదేవపూర్, ముద్ర:** నకిలీ విత్తనాల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నకిలీ విత్తనాల నియంత్రణ, ఫార్మర్ రిజిస్ట్రీ, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, నానో యూరియా వినియోగంపై పోలీస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఏఎస్పీ నరేష్ కుమార్, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రైతులు రాష్ట్ర విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ఆయన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి వారి ఉన్నతికి విత్తన సంస్థ పనిచేస్తుందన్నారు. డీలర్లు ప్రభుత్వం తయారు చేసే విత్తనాలు రైతులు వినియోగించేలా ప్రచారం ల్పించాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసే విత్తనాలు అన్ని నాణ్యతా పరంగా ఉత్తమమైనవన్నారు. ధర తక్కువ ఉండటంతో పాటుగా, దిగుబడి కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ విత్తనాల కంపెనీలు రైతులను ప్రలోభాలకు గురిచేస్తూ, నాసిరకం విత్తనాలు అమ్ముతున్నాయన్నారు. సహకార సంఘాలు, మహిళా సంఘాలు విత్తన సంస్థ యొక్క విత్తనాలు రైతులకు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ వ్యవసాయ శాఖ అధికారులు అంజి ప్రసాద్, శ్రీధర్, డిఆర్డీఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ టౌన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్లలో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా లాడ్జీలు, హోటళ్లకు వచ్చే వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. లాడ్జీలు, హోటళ్లలో మద్యం సేవించడం, పేకాట వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వరాదని హెచ్చరించారు. మైనర్ బాలికలు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ధృవీకరించాలన్నారు. ఈ తనిఖీల్లో పట్టణ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, సిబ్బంది ఉన్నారు.

# ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ప్రభుత్వ పథకాలు

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**ముద్ర, కోరుట్ల:** దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కథలాపూర్ మండలంలో పర్యటించిన ఆయన తండ్రియాల గ్రామంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు రూ.90 లక్షల 10 వేల విలువైన కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు, అలాగే రూ.7 లక్షల 87 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో భరోసానిస్తున్నాయన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కా కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీమ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు న్యావనంది శేఖర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేగ్యారపు శ్రీహరి, సర్పంచులు ముధం రవి, కుంటాల నరేష్, కాంగ్రెస్ నాయకులు లోక నర్సారెడ్డి పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ లో పాల్గొన్న విప్..**

దూలూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు.

## బాలికకు న్యాయం చేయాలి



**ముద్ర, కోరుట్ల:** బాలికకు న్యాయం చేయాలని, బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ గత మూడు రోజులుగా ఘటనపై ఎలాంటి స్పందన లేకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుండి వెంటనే తొలగించాలని, బాలికకు పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండలాధ్యక్షులు దారిశెట్టి రాజేష్, నాయకులు చీటి వెంకట్రావు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పేకటరాయుళ్ళ అరెస్ట్

**ముద్ర, కోరుట్ల:** కోరుట్లలోని జమ్మి గద్దె సమీపంలో ఏడుగురు పేకటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. వారి వద్ద నుండి రూ.8.500 నగదు, ఏడు సెల్ ఫోన్లు, తొమ్మిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. కోరుట్ల పీఎస్ సిబ్బంది శివాజీ, ఎల్లయ్య, గంగాధర్, రామకోటి పాల్గొన్నారు.

# నీళ్లు కావాలంటే రూ.3,500 చెల్లించాలి

**- ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిర్మించిన జగిత్యాల అర్బన్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ప్రస్తుతం 'నీటి' మాఫియా రాజ్యమేలుతోంది. ఇక్కడ నివాసముంటున్న పేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటం కలకలం రేపుతోంది. జగిత్యాల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్బన్ కాలనీకి చెందిన మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి నీటి సరఫరాను పర్యవేక్షించే అయూబ్ ఖాన్ అనే వ్యక్తి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. "నీళ్లు రావాలంటే 3,500 రూపాయలు మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే" అంటూ సదరు వ్యక్తి హుకుం జారీ చేస్తున్నాడని, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**పురుగుల మందు డబ్బాతో వచ్చిన దంపతులు...**

తమకు న్యాయం చేయాలని, లేదంటే ఇక్కడే పురుగుల మందు తాగి చస్తాతామంటూ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి పురుగుల మందు డబ్బాతో దంపతులు రావడం కలకలం రేపింది. జగిత్యాల రూరల్ మండలం గుట్రా జుపల్లికి చెందిన పయ్యావుల రమేష్ దంపతులు తమ పొలానికి వెళ్లే దారిని కొందరు అడ్డుకుంటున్నారని ప్రజావాణిలో అదనపు తో ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా తమను ఇబ్బంది పెడుతున్నారని, తహసీల్దార్, సర్వేయర్ వచ్చి హద్దులు పెట్టిన తమను వేధిస్తున్నారని తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## డిగ్రీ కాలేజీ లో విద్యా వారోత్సవాలు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలను ప్రారంభించారు.స్థానిక కౌన్సిలర్ బి. సుమలత ముఖ్య అతిథిగా వారోత్సవాల గోడ పత్రిక, బ్యానర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా నిర్వహిస్తున్న ఈ ఏడు రోజుల కార్యక్రమాలను విద్యార్థులు, అధ్యాపకులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు. గంగాధర్, ఏఓ నాగ శ్రీనివాస్, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం




**బోథ్, ముద్ర:** దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక డైట్ కళాశాల ఆవరణలో విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎలింకో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల పంపిణీ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అదనపు కలెక్టర్, ఇంచార్జి డిఈఓ రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, కోఆర్డినేటర్ తిరుపతి, ఎంఈఓ సోమయ్య పాల్గొన్నారు.

## గడువు లోగా గణన పూర్తి చేయాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జనగణన ప్రక్రియలో భాగమైన ఇళ్ల గుర్తింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిర్మల్ గ్రామీణ మండలం తల్వేద లో జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ ప్రక్రియకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనగణన ప్రక్రియలో ఇండ్ల గణన అనేది అత్యంత కీలకమని అన్నారు. నిర్ణీత గడువులోగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని వివరించారు. నిబంధనల ప్రకారం జనగణనకు సంబంధించి ఇంటి నంబర్లను కేటాయించాలని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి, జిపిఓ లు జనగణన అధికారుల వెంబడి ఉండాలని పేర్కొన్నారు. జనగణన అధికారులకు అందించిన ఎన్యుమరేషన్ కిట్ లను పరిశీలించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 12.05.2026
www.mudranews.in | @mudranews



### మైగ్రేన్ నొప్పి నివారణకు



ఆహారపు అలవాట్లు: సమయానికి భోజనం చేయకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గి మైగ్రేన్ రావచ్చు. అలాగే చాక్లెట్లు, కెఫీన్ , ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది.

## రజత పతక గ్రహీతకు సన్మానం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** హనుమకొండలో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన షార్ట్ పుట్ అండర్ 20 లో జిల్లాలో శాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ వారిచే నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలోని పి. మహేశ్వరి కి బ్రౌంజ్ మెడల్ గెలుపొందింది. సోమవారం జిల్లా యువజన, క్రీడల అధికారి కే.ధనంజనేయులు తమ కార్యాలయంలో మహేశ్వరిని ఘనంగా శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరి రాబోయే రోజులలో మరిన్ని మేడల్స్ సాధించి యాదాద్రి భువనగిరి జిల్లా ను జాతీయ అంతర్జాతీయ స్థాయి లో నిలబెట్టాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మామిల కుమార్, దర్శనం జానకయ్యా, రాపక వెంకటేష్, కార్యాలయ సిబ్బంది మురళి, జయ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుల పరిశీలన



**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరిలోని పీఎం శ్రీ ప్రభుత్వ హైస్కూల్ (గంజ్)లో సోమవారం సమ్మర్ క్యాంప్‌ను భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించారు."లెర్న్ టుడే , లీడ్ టుమారో " నినాదంతో 6 నుండి 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. చదువుతో పాటు ఆటలు, పాటలు, కళలపై ఆసక్తి పెంచుకోవాలని, మున్సిపల్ తరఫున పాఠశాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్, కౌన్సిలర్ సరిగడ రాజ్యలక్ష్మి అమర్, ప్రిన్సిపల్ ధనుంజయ్, విద్యా కమిటీ చైర్మన్ స్వప్న రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# న్యాయం చేయండి.. మహాప్రభో

**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్టలో యాదాద్రి కొండపై వర్తక సంఘం రద్దు చేయాలని డిమాండ్‌తో ఉద్యమం ఊపందుకుంది. యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కొండపైన వర్తక సంఘం రద్దు చేయాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పాత గుట్ట చౌరస్తా వద్ద నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొండపైన వర్తక సంఘం పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడి కొండపైన వర్తక సంఘంలోని 114 షాప్ సభ్యులు దేవస్థానం ఆస్తి వారి సొంత ఆస్తిలాగా గత కొన్నేళ్లుగా వారే అనుభవిస్తూ టెండర్ లు వేయకుండా కొత్తవారికి నిరుద్యోగులకు ఉపాధి కల్పనా లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. గతం లో కేవలం కొండపైన 14 దుకాణాలు ఉండేవి కానీ అవి కాస్త ప్రస్తుతం 114 దుకాణాలు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. కొండపైన వర్తక సంఘంలోని 114 షాపుల సభ్యుల వివరాలను బయటికి వెల్లడించాలని తెలిపారు. ఇట్టి వివరాలు అన్ని అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలకు నిరుద్యోగులకు వివరించారు. ఈ సంతకాల ప్రతులను సంబంధిత దేవాదాయ ధర్మాదాయ శాఖ, ప్రభుత్వ పెద్దలకు ఇస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో కాటబత్తిని ఆంజనేయులు, సుదుగు జీవన్ రెడ్డి, పల్లపు బాలయ్య, దేవపూజ అశోక్, దండబోయిన వీరేష్, బండ రామస్వామి, గ్యాదపాక బాల్ నర్సింహా, మాటూరి బాలయ్య, బుగ్గ ఆంజనేయులు, పబ్బల ఉప్పలయ్య, మిరియాల క్రిష్ణ, కల్వకొలను సతీష్, కోనె సంజీవ, బండి అనిల్, గోపగాని ప్రసాద్,కర్రె ప్రవీణ్, మందోజు నరేష్ పాల్గొన్నారు.



## దేవాదాయ శాఖాధికారులను కలిసిన భూనిర్వాసితులు



యాదగిరి నరసింహస్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూనిర్వాసితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. దేవస్థానం అభివృద్ధికి తమ భూములు ఇచ్చి సహకరించామని, కానీ దేవాదాయ శాఖ అధికారులు, రాజకీయ నాయకులు కొండపైన వర్తకులకు అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. దేవస్థానం ఆదాయానికి ఏడాదికి సుమారు రూ.30 కోట్లు నష్టపరిచే వర్తకులకు మద్దతు తెలపడం అన్యాయమన్నారు. తాము ఇచ్చిన భూముల్లోనే వర్తకులకు దుకాణ సముదాయాలు కట్టించారని, ఆలయ అభివృద్ధిలో భాగంగా వర్తకులు ఎలాంటి ఆర్థిక, ఆస్తి నష్టం జరగకపోయినా కానీ, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు తాత ముత్తాతల నుంచి సంక్రమించిన వందల ఏళ్లనాటి భూములను రైతులు జీవనోపాధిని కోల్పోయి అప్పగించి ప్రభుత్వానికి అండగా నిలబడ్డట్లు తెలిపారు. రైతు కుటుంబాలతో పాటు నిరుద్యోగ యువత కూడా ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. అయినప్పటికీ స్థానికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఉపాధి కోసం న్యాయం జరగాలని రైతులు, నిరుద్యోగులం నిస్వార్థ పోరాటం చేస్తున్నాం. దేవస్థానం ఉన్నతధికారులుగా తమరు ఇప్పటికైనా నష్టాన్ని గుర్తించి వర్తక సంఘంలోని దుకాణాలకు టెండర్ నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు బూడిద సురేందర్, బూడిద నాగరాజు, బూడిద దేవమ్మ, బూడిద పద్మ, బూడిద నరసింహ, బూడిద సాయికృష్ణ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 47,జిల్లా పంచాయతీ 8, పంచాయతీరాజ్ 3, ఎస్సీ డెవలప్మెంట్ 3, గ్రామీణ అభివృద్ధి శాఖ 2, విద్యాశాఖ 2, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2 హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ , సర్వే ల్యాండ్స్, మైన్స్, ఫిషరీస్, వ్యవసాయ ,జిల్లా సంక్షేమ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని, కొన్ని శాఖలు ఉద్యోగుల వివరాలు అందేజెయలేదని, అట్టి శాఖల ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. తదుపరి జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని , ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగు నీరు, టెంట్ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న 20 దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో, అర్హులైన ఉద్యోగులు ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.బదిలీలు లేదా ప్రమోషన్ల కోసం ఎవరైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పిస్తే వారిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 32 దరఖాస్తులు, డిపిఓ 5, డిడబ్ల్యుఓ 3, డిఆర్డీఏ 2, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డీఎ పిడి సన్యాసయ్య, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీసిఓ ప్రవీణ్ కుమార్, డిఎంహెచ్వో వెంకటరమణ, జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు....

# జనగణన–2027లో ఇండ్ల గణన పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జనగణన–2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న హౌస్ లిస్టింగ్ గణన ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌లో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని పేర్కొన్నారు. ఏ ఒక్క కుటుంబం లేదా గృహం గణనలో వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గణనలో నమోదు చేసే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.అధికారులు సమన్వయంతో పనిచేసి గణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## 15న దేశవ్యాప్త గ్రామీణ సమ్మెకు సహకరించండి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి – జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మె (బంద్) కార్యక్రమానికి సహకరించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి కి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సమ్మె" నోటీసును సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి బొల్లు యాదగిరి, కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షులు, చీమల కొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ సంపదలో కీలక పాత్ర పోషిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఉపాధి హామీ కార్మికులు మోడీ తీసుకొచ్చిన జిరాంజి చట్టం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నెల 15న నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు లక్షలాదిగా పని బంద్ చేసి పాల్గొనాలని వారు కోరారు.

## బెదిరింపులు ఆపి కూలీ రేట్లు పెంచాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పెరుగుతున్న ధరలకుఅనుకూలంగా కూలి రేట్లు పెంచాలని బిల్డింగ్ అండ్ అదర్ వర్కర్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండు అన్నారు. సోమవారం పట్టణంలోని సిఐటియు ఆధ్వర్యంలో భవనిర్మాణ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని పనులు ఆపి నిరసన తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని వెల్ఫేర్ బోర్డు కార్డు, సంక్షేమ బోర్డు కార్డును ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మాయ కృష్ణ, నాయకులు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్ల ముత్యాలు, పాక శంకర్, ఉడుత సోములు, తోట శేఖర్, కుచ్చుల శీను, రహిమాన్ మహబూబ్ షేక్, రాజ్కుల్ షేక్ పాల్గొన్నారు.

## 16 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రైతులను తేమ పేరుతో, మాచర్ రావడం లేదని 16 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరి మండలం వీరవెల్లి గ్రామంలో ఐకెపి కేంద్రాన్ని స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. మండల పార్టీ అధ్యక్షుడు, తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాల్గురి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, భువనగిరి మండల సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జక్కా రాఘవేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తోటకూరి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ కంచు మల్లయ్య, చింతల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, పుట్ట వీరేష్, సింగిల్ విండో డైరెక్టర్ చింతల వెంకటరెడ్డి, రేగు శ్రీశైలం, బండసోమవారం సర్పంచ్ కటిక జంగయ్య, రాసాల శేఖర్ యాదవ్, బాత్కా అశోక్, కడారి బాలు యాదవ్ పాల్గొన్నారు.

## బండి సంజయ్ 24 గంటల్లో రాజీనామా చేయాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ 24 గంటల్లో తన పదవికి రాజీనామా చేయాలని, లేదంటే కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మైనర్ బాలిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా గంటల తరబడి పోలీసులు స్పందించకపోవడం కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి నిదర్శనమని ఆరోపించారు. ఇదే ఘటన సామాన్యుల విషయంలో జరిగి ఉంటే పోలీసులు వెంటనే పోక్సో కేసు నమోదు చేసి హడావుడి సృష్టించేవారని విమర్శించారు.బాధిత బాలికతో సిట్టింగ్ జడ్జి సమక్షంలో వెంటనే వాంగ్మూలం నమోదు చేయాలని, ఆ తర్వాత ఏదైనా జరిగితే దానికి పూర్తి బాధ్యత బండి సంజయ్‌దేనని హెచ్చరించారు. మంత్రి పదవిలో కొనసాగుతూ తన ప్రభావాన్ని ఉపయోగించి బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకురావచ్చని ఆరోపించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించకపోతే మహిళలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, మాజీ జెడ్పీటీసీ సుబ్బుర్ బీరు మల్లయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బి ఆర్ ఎస్ నాయకులు శెట్టి బాలయ్య యాదవ్, పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు ర్యాకల శ్రీనివాస్,కౌన్సిలర్ రాజు మాజీ కౌన్సిలర్లు,కంచి మల్లయ్య మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ జక్కా రాఘవేందర్ రెడ్డి, డైరీ డైరెక్టర్ పండు, రమేష్,బురాన్, ఇస్మాయిల్, సూరజ్, అజయ్,మహిళలు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 12.05.2026
www.mudranews.in | @mudranews



### మైగ్రేన్ నొప్పి నివారణకు ఇవి పాటించండి:

మెగ్నీషియం అధికంగా ఉన్న ఆహారం: మెగ్నీషియం లోపం వల్ల కూడా మైగ్రేన్ వచ్చే అవ కాశం ఉంది. ఆకు కూరలు, బాదం గుమ్మడి గింజలు వంటి మెగ్నీషి యం ఉన్న ఆహారాన్ని డైట్‌లో చేర్చుకోవాలి.



# జన గణనలో భాగస్వామ్యులు కావాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** జనగణనలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమన్నారు. సోమవారం ఉద యం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రజల సహకారంతో కార్యక్రమం విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనం తరం జనగణన ట్యాబ్ లు ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన తెలం గాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇది మొదటి జనగణన అని, మొదటి సారి డిజిటల్ విధా నంలో ఈ జనగణన నిర్వహిస్తున్నట్లు తెలి పారు. జనగణన ఎన్యూమరేటర్లు ఇంటిం టికీ తిరిగి వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు. వారికి సహకరించాలని సూచిం చారు. జనగణన పేరుతో ఎవరైనా అను మానిత వ్యక్తులు మీ ఇంటికి వచ్చి వివరాలు అడిగే అవకాశం ఉంటుందని, అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరిం చాలన్నారు. జనగణనలో పాల్గొనే సిబ్బం దికి జారీ చేసిన గుర్తింపు కార్డుల మీద క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేస్తే అధికారిక వెబ్ సైట్ లో పొంది ఉంచిన వారి పూర్తి వివరాలు వస్తాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెద క్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజు, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీఎఫ్ఓ జోజి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

### సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ..

కొల్చారం మండల కేంద్రంలో ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రం, సత్య సాయి రైస్ మిల్ ను కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీ లించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, కొనుగోలుకు సంబం ధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుం టున్నామన్నారు. అన్లోడింగ్ లో సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు సమన్వయంగా వ్యవహరించాలని సూచించారు.

### హెచ్ పీవీ వాక్సిన్ పై అవగాహన ..

హెచ్ పీవీ వాక్సిన్ పై అవగాహన కల్పిం చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో పీవీవాక్సిన్, ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు, సిఎస్ఆర్ నిధులు, ఉపాధి హామీ పథకం, జనగణనపై సమీక్షిం చారు. జిల్లాలోని 14 నుంచి 15 మధ్య వయ స్సు గల బాలికలందరికి హెచ్.పి.వి వ్యాక్సిన్ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 13 నుంచి 21 వరకు జరిగే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బం దీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీ క్షలను ప్రశాంత వాతావరణంలో రాయ డానికి కావలసిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించి ఉపాధి కల్పించా లన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలె క్టర్ నగేష్, జెడ్పి సిఈఓ ఎల్లయ్య, డీఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మా ధవి, మెడికల్ సూపరిండెంట్ సునీత దేవి, డీసీహెచ్ డా.శివ దయాల్ పాల్గొన్నారు.

### డిజిటల్ బోర్డులు ప్రారంభం..

చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ క్లాస్ రూమ్ బోర్డులను కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారం భించారు. నాణ్యమైన విద్య–భవిష్యత్తుకు నాంది కార్యక్రమంలో భాగంగా డిజిటల్ క్లాస్ రూమ్ బోర్డులను ఏర్పాటు చేశారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఎదుర్కొంటున్న సమ స్యలు పరిష్కరించాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నాయకులు కలెక్టరేట్ హైమావతికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని మార్కెట్, ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ధాన్యం, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలను కేంద్రాలలో వెంటనే కొనుగోలు చేరుకోవడం మూలంగా అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గన్ని బ్యాగుల ఇబ్బందులు ఉన్నాయని, ధాన్యం కొనుగోలుకు పరిమితులు విధించడం మూలంగా ఆ నిబంధనలకు లోబడి పంట మొత్తం కొనుగోలు చేయకపోవడం మూలంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచర్ పేరుతో ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ కింద నమోదు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, లారీల కొరత ఉందన్నారు. కొనుగోలు వేగవంతం చేయకుండా అకాల వర్షాలతో ధాన్యం తడిస్తే రైతులు నట్టేట మునిగే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కూడా లేవని, ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించి కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. పండిన పంటనంతటిని కొనుగోలు చేసి మ్యాచర్ ఇతర ఇతర పేర్లతో రైతాంగాన్ని నష్టపరిచే విధానాలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్, బత్తుల అభిషేక్ భాను, స్వర్గం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి




**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభిం చాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అదనపు కలెక్టర్ నగేశ్ కు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు అడివయ్య మాట్లాడుతూ మెదక్ జిల్లా లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మల్లేశం, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే మల్లేశం, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గౌరయ్య, అజయ్, పార్టీ సభ్యులు దుర్గ యాదగిరి, వెంకట్, నరేందర్, నహీం, ప్రవీణ్. ప్రశాంత్, ల చ్చ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### వేతనాలను వెంటనే చెల్లించాలి..

ఆశా, అంగన్ వాడీలకు ఏప్రిల్ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ కలె క్టర్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ను అమలు చేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



**ముద్ర ప్రతినిధి మెదక్:** జిల్లాలో 19,206 మంది రైతుల నుండి 90 వేల 685 మెట్రిక్ టన్నుల ధాన్యం కొను గోలు చేసినట్లు జిల్లా పౌర సరపరా అధికారి నిత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 8326 మంది రైతులకు రూ.96.42 కోట్లు అకౌంట్లో జమ చేశామన్నారు. మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగు తుందన్నారు. జిల్లాలో 533 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదే శాల మేరకు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను సంద ర్శించి ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రవాణా సంబంధిత విషయాలలో ప్రణాళిక బద్దంగా ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నట్లు వివరించారు.

## మెదక్ డీఆర్ఓగా అంబదాస్ రాజేశ్వర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్ఓ) గా జి.అంబదాస్ రాజేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన ఆయన, ఎన్నికల వేళ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. తాజాగా సివిల్ సప్లై శాఖ నుంచి మెదక్‌కు బదిలీ కావడంతో తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొ క్కను అందజేశారు. అధికారులు, సిబ్బంది ఆయ నకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇళ్ల జాబితా నమోదు ప్రక్రియ ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో జనగణన ఇళ్ల జాబితా నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభ మైంది. స్వీయ గణన ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని 1,68,677 ఇళ్లలో వివరాల సేక రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం 1,439మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూప ర్వైజర్ చొప్పున 261మంది, 25మంది ఇంచార్జ్ అధికారులను నియమించారు. నేటి నుంచి ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి బ్లాక్ నెంబర్ల కేటాయింపుతో పాటు మ్యా పింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

తొలి దశ గృహాల నమోదు కార్యక్ర మంలో భాగంగా ఈనెల 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేస్తారు. రెవెన్యూ గ్రామాల ఆధారంగా 700 నుంచి 800 మందికి ఒక బ్లాక్‌గా జిల్లాలో 1695 హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లుగా విభ జించారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1,68 లక్షల కుటుంబాలు ఉండ గా జనాభా 7,67, 428 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 3,78, 654మంది మహిళలు 3,88,774 మంది ఉన్నారు.

## పాఠశాలలో వేసవి శిబిరం ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లాలోని పీఎంశ్రీ బీర్కూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం వేసవి శిబి రాన్ని ప్రధానోపాధ్యాయుడు శివరాం ప్రార భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం ఈనెల 25 వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థుల్లో నైపు ణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలి పారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కుట్లు, అల్లికలు సంగీతం, యోగా, చెస్, క్యారమ్ బోర్డ్, రైటింగ్, రీడింగ్, డ్రాయింగ్, క్విజ్ పోటీలు తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు శివరాం చెప్పారు. ఉప సర్పంచి పరమేష్, పీటీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..

# డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 11 నుండి 17 వరకు నిర్వ హించనున్న విద్యా వారోత్సవాలు కార్యక్ర మాలను కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెస ర్ కె. రామకృష్ణ సోమవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా విద్యా వారో త్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణా ళిక, కళాశాల ప్రవేశాల కోసం సమాచార బ్రోచర్లు, ఫ్లెక్సీలను అధ్యాపక బృందం ఆవి ష్కరించింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెంపొం దించడం, విద్యార్థుల్లో ఉన్నత విద్యపై అవ గాహన కల్పించడం, ప్రభుత్వ డిగ్రీ కళా శాలల బలోపేతం, సమాజంలో విద్యా చైత న్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్ర మాలను నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు తెలిపారు. నోడల్ ఆఫీసర్‌గా జి. చంద్రయ్య వ్యవ హరించగా ప్రొఫెసర్ టి. ప్రమోద్ కుమార్, ప్రొఫెసర్ వా సాల వర ప్రసాద్, ఎన్.వాసవి, జి. శ్రీలత, డి. సుజాత, ఎన్. సం గీత రాణి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

# జన గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జన గణనకు ప్రతి ఒక్కరు సహక రించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. భారతదేశ జనాభా గణన – 2027లో భాగంగా గృహ జాబితా, గృహ గణన ప్రారంభ కార్యక్రమంలో భాగం గా జగిత్యాలలో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొని ఆయన నివాసం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ,రాష్ట్ర అభివృద్ధికి ఖచ్చిత మైన జనాభా గణాంకాలు ఎంతో ముఖ్య మని పేర్కొన్నారు. జనాభా గణన ద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై సమాచారం ప్రభుత్వం వద్దకు చేరు తుంద న్నారు. కమిషనర్ సత్య ప్రణవ్, ఏఎంసీ చైర్మె న్ గడ్డం నారా యణ రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, నక్కల రవీం దర్ రెడ్డి, ఎన్యూమ రేటర్లు ప్రసాద్ రావు, మల్హాల్ రావు, శ్రీనివాస్, జాఫర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలి




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయా లని డిమాండ్ చేస్తూ జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తాలో బీఆర్ఎస్, బీఆర్ఎస్ వీ నాయకులు సోమవారం ధర్నా చేశారు. పలువురు నాయకులు మా ట్లాడుతూ బండి సంజయ్ ని కేంద్ర మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నాయకులను పోలీసు స్టేషన్ కు తరలించి ధర్నా విరమింప జేశారు. బీఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు దావ సురేష్, నాయకులు దేవేం దర్ నాయక్, సమల్లా రాజశేఖర్, హరీష్, దుర్గయ్య, శీలం ప్రవీణ్, వెంకటేశ్వర రావు, ఐల్నేని ఆనంద్ రావు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com